# దృక్కోణాలు!

నా స్నేహితురాలు, ఎమిలీ, లంచికి పిలిచింది నన్ను.

"ఎక్కడ కలుద్దాం?" అనడిగాను.

"నీకు కారాలు ఇష్టం కదా, రొటిసరీకి వెళ్దాం, సదర్న్ వంటకాలు రుచి చూద్దువు గాని" అంది తను.

మన ఆచారాలు, వ్యవహారాలూ, విలువలూ తెలుసుకోవాలని ఆవిడ తహతహ.

నాకు వారి సాంప్రదాయాలలో ఆసక్తి. అంచేత మేం తరుచూ కలుసుకు ఊసులాడుకుంటూంటాం. ఒకొకప్పుడు నిజంగా తరచి చూస్తే, అట్టడుగుపొరల బేధాలు లేవేమో అని కూడా అనిపిస్తుంది మాకు.

ఇద్దరం ఎదురెదురుగా కూచున్నాం.

ప్రాక్ – పశ్చిమాలు

తన బ్లూజీన్స్‌కి దీటుగా నా కుంకుమ

ఆవిడ శ్వేతవర్ణం– నాకాఫీరంగు

శిశిర శీతలదేశం – నిప్పులు చెరిగే ఎండలు

సదర్న్ చికెన్ – హలపినో మిరపకాయలు

ఆ చిన్నబల్లకి చెరోపక్కన కూచున్నాం ఇద్దరం రెండులోకాల వ్యత్యాసాలకి ప్రతినిధుల్లా ..

మనకి తెలిసిన సంగతులకీ తెలియనిసంగతులకీ మధ్య కోటానుకోట్ల నీలినీడలు ..

మనం చెప్పదల్చుకున్న మాటకీ అప్రయత్నంగా వెలువడే వాక్యవిన్యాసానికీ మధ్య తేలియాడే అనంతాకాశం ..

అనాలోచితంగానే, కుటుంబ విషయాలలోకి దిగింది చర్చ ––చెప్పదలుచుకున్నవి, చెప్పదలుచుకోనివి, చెప్పకూడదనుకున్నవి, చెప్పగలిగినవి, చెప్పలేనివి ––దొర్లిపోతున్నాయి, నీటిజాలులో పండుటాకుల్లా.

ఒక సందర్భంలో నేను యిచ్చిన ఉపన్యాసంమాట వచ్చింది. సీనియర్ సిటిజన్స్ కాలక్షేపంకోసం ఏర్పాటు చేసిన సభ అది. ''వాళ్లు నాచిన్నతనం, నేను పెరిగిన వాతావరణం గురించి అడిగారు. నేను మాటాడుతూ, నాచిన్నతనంలో నేను ఇంటిపనులేం చేసేదాన్ని కాదు, మాఅమ్మ, అక్కయ్యా–వాళ్లే అన్నీ చూసుకునేవారు అన్నాను. యూ ఆర్ స్పాయిల్డ్ అంది ఒకావిడ. నాక్కోపం వచ్చింది.''

''అలా అనడంలో ఆవిడ అభిప్రాయం ఏమిటో అడిగావా?'' అంది ఎమిలీ.

''నిజానికి నాకది చాలా అవమానంగా తోచింది. మా సంప్రదాయాల్లోని సంగతి సందర్భాలని అర్థం చేసుకునే ఆలోచన వాళ్లకి లేదు అనిపించింది. వాళ్లు మళ్లీ పిలిస్తే నేను ఒప్పుకోలేదు కూడాను.''

★★★

మధ్యగదిలో కూచుని కిటికీలోంచి దూదిపింజల్లా ఎగురుతున్న మంచు తుంపరలు చూస్తున్నాను. మోడువోయిన కొమ్మలమీద అలవోకగా వాలుతున్న మంచూ, వుండీ వుడిగీ కలుగుల్లోంచి వెలుగులోకొచ్చే ఉడతలూ, తమగుంపుతోపాటు దక్షిణయాత్ర చేయ మరిచిపోయి వెనక్కుండిపోయిన ఒకటీ అరా కొంగలూ--ఇంట్లో కూచుని చూడ్డానికి తమాషాగా ఉంటుంది ఇక్కడ చలికాలం.

నిన్నటి సంభాషణ జ్ఞాపకం వొచ్చింది. ఆలోచిస్తే అనిపిస్తోంది--నన్ను స్పాయిల్డ్ అన్న ఆ వృద్ధురాలికంటె నేనెలా మెరుగు? నేను మాత్రం అనాలోచితంగానే అభిప్రాయం ఏర్పరుచుకోలేదూ? నన్ను ఆవిడ చులకన చేసిందనే అనుకున్నాను కానీ, ఆవిడ హాస్యానికందేమో? వివరంగా చెప్పమని అభిప్రాయమేమో? అసలేమీ కాదేమో, ఊరికే ఏదో ఒకటి మాటాడాలనో, బోరు కొట్టో, వచ్చే నిద్ర ఆపుకోడానికో ..

ఆకాశాన దట్టంగా ముసురేసుకుని ఉంది.. మంచు క్రమంగా నీటి తుంపరలుగా మారిపోతోంది. ఫ్రీజింగ్ డ్రిజిలంటారు. అదేవిటో, నాకు మాత్రం హాస్యాస్పదంగా ఉంటుందామాట తియ్యని కారంలా.

మళ్లీ ఆలోచనలో పడ్డాను. ఎమిలీ శనివారం తల్లిని చూడడానికి వెళ్తున్నాం అంది. కొడుకు, పెళ్లి చేసుకోబోయే అమ్మాయిని తీసుకువస్తున్నాట్ట అమ్మమ్మగారికి పరిచయం చేయడానికి.

''బావుంది. చిన్న ఫామిలీ రియూనియన్,'' అన్నాను.

ఎమిలీ సాలోచనగా నావేపు చూసి, ''అంత తేలిక కాదు'' అంది. నేను మాటాడలేదు.

''పిల్లలిద్దరూ పెళ్లి కాకుండా ఒకే ఇంట్లో ఉంటున్నారని మా అమ్మకి కోపంగా ఉఃది. వాళ్లతో మాటడనంది. అబ్బాయి మాత్రం తన కాబోయే భార్యతో అమ్మమ్మని చూడడానికే నిశ్చయించుకున్నాడు. ఆవిడ ఏమైనా అననీ గాక అన్నాడు.''

వైట్రెస్ వచ్చింది ఏం తెమ్మంటారంటూ.

తను చికెను, నేను సదర్న్ సూప్ చెప్పాం. ఆ అమ్మాయి సరే అని వెళ్లిపోయింది. నేను కిటికీలోంచి రోడ్డుమీద హడావుడిగా పరుగెలెడుతున్న కార్లు చూస్తున్నాను. ఎమలీ తలొంచుకుని, తనలో తనే మాటాడుకుంటున్నట్టు, నెమ్మదిగా చెప్తోంది. ''మా అమ్మకి చాలా పట్టుదల. నాకిలాగే ఇంతకాలం జరిగిపోయింది, ఇప్పుడెందుకు మార్చుకోవాలి నా అభిప్రాయాలు అంటుంది. నిజమే కావచ్చు. ఆవిడ నమ్మకాలు ఆవిడవి. నేనెక్కడ బాధ పడతానో అని ఆవిడ తాపత్రయం.''

నాకేం మాటాడ్డానికీ తోచలేదు.

కొన్ని క్షణాలయింతరవాత, తనే మళ్లీ అంది, ''తనబిడ్డని గూర్చి తనకీ, నా బిడ్డని గూర్చి నాకూ మనస్తాపాలు.'' లీలగా ఎమిలీ పెదవులమీద ఓ చిన్న చిరునవ్వు మెరిసింది. తన ముఖకవళికలు గమనిస్తూ ఎంతసేపు కూర్చున్నానో అలా ..

★★★

ముసిరిన ఆకాశాన మసలుతున్న ఫ్రీజింగ్ డ్రిజిల్. .. నీటి తుంపరలుగా రూపాంతరం చెందుతున్న మంచు తునకలు .. మళ్లీ ఎమిలీ మాటలు గుర్తుకొచ్చాయి. ''నా కొడుకు క్షేమం నాక్కావాలి. తన కూతురి క్షేమం తనక్కావాలి.''

ఆ తల్లీకూతుళ్ల సంభాషణ ఊహించుకోడానికి ప్రయత్నిస్తున్నాను.

మరొక సంభాషణ గుర్తుకొచ్చింది--బామ్మ, మనవడి మధ్య. నిజంగా ఏం జరిగిందో నాకు తెలీదు. కాని నాఆలోచనలు మామూలుగా మన ఇళ్లల్లో అలాటి సందర్భాల్లో ఎలా ఉంటాయో అని ...

తల్లీ కొడుకుల మధ్య

తల్లీ కూతుళ్ల మధ్య

మామ్మలూ, బామ్మలూ ఓ పక్కా, మనవలూ మనవరాళ్లూ మరో పక్కా ఆలోచిస్తూంటే, కిందటేడు బజారులో పరిచయం అయిన కుర్రాడు జ్ఞాపకం వచ్చాడు. ఇప్పుడు పేరు కూడా గుర్తు లేదు. శామీ అని పిలవమన్నాడు. ఏదో ట్రైనింగుకి వచ్చాట్ట, మూడునెలలపాటుంటాట్ట. నాచేతిలో తెలుగు పుస్తకం చూసి, ''నేను కూడా తెలుగువాడినేనండీ'' అంటూ చేటంత మొహం చేసుకుని, ''మీతో మాటాడాలండీ,'' అని ఫోన్నెంబరు తీసుకున్నాడు. ఇదిక్కడ మామూలే. చాలామంది మళ్లీ కనిపించరు.

శామీ నిజంగా పిలిచేసరికి, రవంత అక్కజపడ్డాను. సరే ఆదివారం సాయంత్రం రండి, భోంచేస్తూ మాటాడుకుందాం అన్నాను.

''ఎందుకండీ మీకు శ్రమ. ఊరికే మాటాడ్డానికి వస్తాను. మీకు నాపెళ్లి ఫొటోలు చూపిస్తాను.''

''ఎక్కడుంటారో చెప్పండి, కారు తీసుకొస్తాను.''

''అక్కర్లేదండీ. మీ ఎడ్రెస్ చెప్పండి. బస్‌లో వస్తాను.'' చెప్పానే కాని ఇతడి ధోరణి కొంచెం వింతగానే తోచింది. సాధారణంగా మనవాళ్లు, అందునా కొత్తగా వచ్చినవాళ్లు మనరుచులకి సరదా పడతారు. కారు తీసుకొస్తాం అంటే వద్దనరు. ఇదేదో ఘనమైన విషయమే అనిపించింది.

అనుకున్నట్టే, ఆదివారం సాయంత్రం, నాలుగ్గంటలకి వచ్చాడతను.

అట్టే ఆలస్యం చేయకుండానే, సంచీలోంచి పెళ్లిఫొటోలు తీశాడు.

నెమ్మదిగా కథ విశదమవుతోంది.

ఇక్కడికొచ్చేముందు, రెండు రోజులకి బయల్దేర్తాడనగా, పెళ్లయింది. తెలిసిన అమ్మాయే! తన ఆఫీసులో, తన ట్రైనింగ్ సూపర్‌వైజర్. అనతికాలంలోనే, ఆవిడ విధి ఉద్యోగావధులు దాటి వ్యక్తిగత విషయాలకి దారి తీసింది. అంతలోనే ఫారిన్ ట్రైనింగ్ అవకాశం వచ్చింది. పెళ్లి చేసుకు వెళ్లమని పట్టు పట్టిందా అమ్మాయి. అతను కాదనలేకపోయాడు. కాని తల్లికి చెప్పే సాహసం లేకపోయింది.

ఎందుచేతంటే ..

తన తల్లిదండ్రులు పరమ ఛాందసులు. తరతరాల ఆచారాలని చాలా కఠినంగా పాటిస్తారు. కులాంతర వివాహానికంగీకరించరు. అసలు వేరు శాఖలయితేనే ఒప్పుకోరు. అది చాలనట్టు ఆ అమ్మాయి ఉన్నత ఉద్యోగస్థురాలు కూడాను!

ఒక్కొక్క బొమ్మ చూపిస్తూ చెప్తున్నాడు. ''తననొదిలి బతకలేను. అంచేత ఒప్పేసుకున్నాను. వాళ్లవాళ్లు పూనుకుని పెళ్లి జరిపించేశారు.''

బొమ్మలు బావున్నాయి. శాస్త్రోక్తంగా చేశారు–గౌరీపూజ దగ్గర్నుంచి, అగ్నిహోత్రం, మంగళ సూత్రధారణ, సప్తపాదాలు తొక్కడం, హనీమూన్ పిక్చర్సుతో సహా సంపూర్ణంగా ఉంది ఆల్బమ్.

తక్కువైంది ఏమిటి అంటే వరునికి ఇరుప్రక్కలా ఉండవలసిన తల్లిదండ్రులు లేకపోవడం! వరుని తరఫున చుట్టం అతనొక్కడే!

ఎందుచేతనంటే ..

''చెప్పలేకపోయాను. వాళ్లు చాలా బాధ పడతారు. మానాన్నగారు మండి పడతారు. మా బామ్మ అస్తమానం అంటూంటుంది నాపెళ్లి చూడడానికే బతికున్నానని. మా అమ్మ గుండె పగిలిపోతుంది.''

నేను అతనివంక తీక్షణంగా చూశాను.

తన తల్లదండ్రులని ఒప్పించి, పెళ్లి ఏర్పాట్లు చేయించగల ధైర్యం ఆపిల్లకుంది గాని ఇతడికి లేకపోయింది!

తరతరాలగా స్థిరపడిపోయిన కులతత్త్వాలని కాదని వర్ణాంతర వివాహానికి తలపడిన ధీరుడు! వధువు పక్కన ఒంటరిగాడు కూడా అతడే! మొత్తం పెళ్లితంతు అంతా ఏకాకిగానే జరుపుకున్నాడు.

అతన్ని గురించి ఏమనుకోవాలో నాకు తోచలేదు. కులవ్యవస్థని ఎదిరించిన ధీరుడా, తనపెళ్లికి కన్నతల్లినీ తండ్రినీ పిలవలేని పిరికివాడా?

అతడు నాతో మాటాడాలని ఎందుకంత తాపత్రయ పడ్డాడో నాకు అర్థం అయింది. నన్ను టార్గెట్ ప్రాక్టిస్‌కి వాడుకుంటున్నాడు. తల్లితో చెప్తున్నప్పుడు ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ..

దుర్మార్గుడా! అనుకున్నాను నాలో నేను.

''మా అమ్మ గుండె బద్దలయిపోతుంది,'' అన్నాడు నేలమీద దృక్కులు నిలిపి.

''ఆవిడ గుండె బద్దలయింది. ఆవిడకి తెలీదంతే.'' అన్నాను కఠినంగా.

''అవునండి'' అన్నాడు తలొంచుకునే, పట్టుబడ్డ దొంగలా.

★★★

మంచు తునకలు ఆగిపోయి చినుకులు మొదలయాయి. ఇప్పుడు వీధిలోకెళ్తే జారి పడ్డం ఖాయం. ఇంక ఇవాళ్టికి వాక్ లేనట్టే.

ఏదేశంలో ఏభాషలో మాటాడినా, ధోరణులలో వ్యత్యాసం అట్టే లేదేమో అనిపిస్తోంది ఎమిలీ మాటలు తలుచుకుంటే. ఏదేశంలోనూ, ఏజాతిలోనూ కుటుంబానికి సంబంధించిన నీతిసూత్రాలొకటే ఏ ఒక్క కాలం తీసుకున్నా. కాని ఒక తరానికీ, మరొక తరానికీ గల బేధాలు చూస్తే మటుకు మారుతున్న విలువల్లో బేధం ఎక్కువగా కనిపిస్తుందనుకుంటా.

★★★

(ఆగస్ట్ 2002)